## ఎస్‌యూలో మహనీయుల జయంత్యుత్సవాలు



పోస్టర్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య యూ ఉమేశ్ కుమార్, తదితరులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 9 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ అనుబంధ కళాశాలల సమన్వయంతో బాబూ జగ్జీవన్ రామ్, జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాలను నాలుగు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఉప కులపతి ఆచార్య యూ ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక్కడ వీసీ ఓఎస్డీ డాక్టర్ హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత, ఎన్ఎస్ఎస్ సెల్ సమన్వయకర్త మనోహర్, డాక్టర్ అబ్రరుల్ బకి తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ విద్యార్థికి ఆల్ ఇండియా మూడో ర్యాంకు



విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 9 : అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి యునిఫైడ్ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ఆల్ ఇండియా 3వ ర్యాంకు సాధించగా, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పోటీల సంస్థల యునిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన జాతీయ స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన ఎం శివేన్ రెడ్డి, అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించడంతో పాటు రూ. 10 వేల నగదు బహుమతిని గెలుచుకోవడం గొప్ప విషయమన్నారు.

## పారమిత పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 9: ఎన్ఐటీ నాగపూర్‌లో ఇటీవల నిర్వహించిన డీక్స్‌టర్ యాక్సిస్ 25 పరీక్షలో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపగా, వారిని విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినులు సారా సర్ఫరాజ్, లింగాల హర్షిత, కందుకూరి రిషిత అత్యుత్తమ ప్రతిభ చూపి, రెండో రౌండ్‌కు అర్హత సాధించారన్నారు. అలాగే, నాగపూర్ ఎన్ఐటీ మార్చి 22, 23 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన రెండో రౌండ్‌లో కందుకూరి రిషిత అద్భుత ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచి నగదు పురస్కారం అందుకున్నదని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పారమిత పాఠశాలల డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, హనుమంతరావు, రమణ, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత, ప్రసాద్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు అభినందించారు.

## బీఎస్సీ పరీక్ష ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 9: ఎస్‌యూ పరిధిలో బీఎస్సీ హానర్స్, కంప్యూటర్ సైన్స్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి సురేశ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరిలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు http://103.119.113.107:89, www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 9: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలని హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. పట్టణంలోని గణేశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సీడీపీవో సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహారం గురించి వివరించారు.

## ఆపదలో చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలి

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 9: పిల్లలు ఆపదలో ఉంటే 1098 లేదా 9490881098 నంబర్‌కు కాల్‌కు సమాచారం అందించి, రక్షణ పొందవచ్చని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల సంపత్ తెలిపారు. బుధవారం దేవంపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్ అతిగా వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, బాలల హక్కులు, 1098 టోల్ ఫ్రీ నంబర్ ఆవశ్యకత గురించి వివరించారు. ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, డీసీపీయూ సిబ్బంది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ధాన్యం సేకరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కలెక్టరేట్, ఏప్రిల్ 9 : జిల్లాలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల్లో తేమ, తాలు లేకుండా ధాన్యం సేకరించాలని, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. ధాన్యం కొనుగోళ్లు, యూనిఫాం కుట్టు పని, ఇతర కార్యక్రమాల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సెర్ప్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలుకు సంబంధించి పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు డాటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే యూనిఫాం సకాలంలో కుట్టించి, సంబంధిత పాఠశాలలకు చేరవేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరిగిన పనులు పరిశీలించాలని సూచించారు. వీవోఏల వేతనాల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా, సంబంధిత బాధ్యులను విధుల నుంచి తొలగించి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు. సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా డీఆర్‌డీవోకు గాని, తనకు గానీ నేరుగా తెలపాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీధర్, అదనపు డీఆర్‌డీవో సునీత, స్త్రీనిధి ఆర్ఎం, డీపీఎంలు, ఏపీఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

***డీడబ్ల్యూవో కార్యాలయం సందర్శన***

జిల్లాకేంద్రంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. భగత్‌నగర్‌లో గల ఆ సంస్థ కార్యాలయానికి మధ్యాహ్నం ఆకస్మికంగా వెళ్లి, సిబ్బంది హాజరు రిజిస్టరు తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది వివరాలు అడిగి తెల్సుకున్నారు. శాఖ పరిధిలోని పలు ప్రభుత్వ పథకాల అమలులో సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఆశాఖ పరిధిలోని చైల్డ్ హెల్ప్‌లైన్, మిషన్ వాత్సల్య, మహిళా సాధికారత విభాగాల్లో తిరుగుతూ, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సెక్షన్ ఇన్‌చార్జిలు, విభాగాల బాధ్యులు, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట డీడబ్ల్యూవో సబిత, ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్





మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

హుజూరాబాద్, ఏప్రిల్ 9: నేటి కాలంలో బీఎస్సీ, బీకాం లాంటి డిగ్రీ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు కూడా ఉన్నత శ్రేణి కంపెనీల్లో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల కార్యదర్శి వొడితల సతీశ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో విబ్జిఆర్ 2025 విద్యార్థుల ఉత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎన్ హనుమకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు, విద్యార్థులు చదువుతోపాటు ఏదైనా ఒక రంగంలో విశేష ప్రతిభ కలిగి ఉండాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు కార్పొరేట్ కంపెనీలు మంచి అవకాశాలు, ఎక్కువ వేతనాలు ఇస్తున్నాయని తెలిపారు. సమయం అత్యంత విలువైందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాంపల్లి రజిత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

చొప్పదండి, ఏప్రిల్ 9: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అమ్మాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఆదేశించారు. బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో డీలర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

## రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 9: అకాల వర్షాలు, వడగళ్లతో నష్టపోకుండా ఉండేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మానకొండూర్ డివిజన్ ఏడీఏ శ్రీధర్ సూచించారు. మండల కేంద్రంలో వరి పంటలను ఏవో రాజుల నాయుడుతో కలిసి పరిశీలించారు. వరి పూర్తిగా పరిపక్వతకు వచ్చాకే కోతలు మొదలుపెట్టాలని, లేకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. రైతులకు ఏమైనా సమస్యలు వస్తే సంబంధిత ఏఈవోలను సంప్రదించాలన్నారు. వీరి వెంట ఏఈవో ఫరీద్ తదితరులున్నారు.

## మహిళల భద్రతకు షీ టీం భరోసా

విద్యానగర్, ఏప్రిల్ 9: మహిళలు, బాలికల భద్రతకు కరీంనగర్ కమిషనరేట్‌లోని షీ టీం ప్రత్యేక చర్యలు తీసుకుంటు భరోసా కల్పిస్తున్నదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల్లో మహిళలను వేధిస్తున్న వారిపై 8 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, 65 హాట్ స్పాట్స్ వద్ద నిఘా ఉంచి 16 మంది పోకిరీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని వారి కుటుంబ సభ్యుల ఎదుట కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న వారు టీ సేఫ్ యాప్ వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే వెంటనే షీ టీం 8712670759 నంబర్‌కు లేదా డయల్ 100కు లేదా పోలీసులకు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 9: వేసవి దృష్ట్యా అన్ని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో ప్రయాణికులకు మంచినీటి వసతి కల్పించాలని, రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని కరీంనగర్ ఆర్ఎం రాజు సూచించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల సమావేశ మందిరంలో ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 మంది డీఎంలతో ఆర్ఎం బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిపోల వారీగా ఆదాయ వ్యయాలు, మెకానిక్ విభాగాల పనితీరును అడిగి తెసుకున్నారు. సమావేశంలో డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ఎల్సీపై శిక్షణ

ముకరంపుర, ఏప్రిల్ 9: క్షేత్ర స్థాయిలో పనిచేసే విద్యుత్ సిబ్బందికి కరీంనగర్ సర్కిల్ కార్యాలయ మీటింగ్ హాల్లో బుధవారం ఆన్‌లైన్ ఎల్సీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టౌన్–1, 2, అలుగునూరు సబ్ డివిజన్లలోని ఏఈలు, క్షేత్ర స్థాయి సిబ్బంది, సబ్ స్టేషన్ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఎస్ఈ ఎం రమేశ్ బాబు మాట్లాడుతూ.. వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలందించేందుకు ఆన్‌లైన్ లైన్ క్లియర్(ఎల్సీ) విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన యాప్ వినియోగం, నిర్వహణ, ఇతర అంశాలపై నిపుణులు సిబ్బందికి విపులంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈలు ఉపేందర్, రాజం, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

గంగాధర, ఏప్రిల్ 9: గర్శకుర్తిలో సీఐఎస్ఎఫ్ జవాన్ కత్తి మహేశ్, స్థానిక యువకులు అలువాల వేణు, చిప్ప పూర్ణచందర్, గుంటి ప్రవీణ్, చిందం సంతోష్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసిన వారిని గ్రామస్తులు అభినందించారు. ఇక్కడ నాయకుడు తడిగొప్పుల రమేశ్, గ్రామస్తులు ఉన్నారు.

## జ్యోతిష్మతి విద్యార్థులకు యూఎస్‌లో పరిశోధనకు అవకాశం



యూఎస్‌లో పరిశోధనకు ఎంపికైన జిట్స్ విద్యార్థులు

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 9: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాల విద్యార్థులకు యూఎస్‌లో పరిశోధనకు అవకాశం లభించినట్లు కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వాప్ ఇండియా ఇన్ అసోసియేషన్, టాస్క్ అండ్ ఎడ్యునేట్ ఫౌండేషన్ ద్వారా కళాశాలలో స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా స్వాప్ ఇండియా కోడ్ ఉన్నతిలో భాగంగా ఇంజినీరింగ్ కళాశాలలోని 3, 4వ సంవత్సరం విద్యార్థులకు తాజా సాంకేతికతపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రాజెక్ట్ కోడ్ ఉన్నతి మారథాన్ హైదరాబాద్‌లో జరుగగా, ఇందులో 450 జట్లు పాల్గొనగా 25 జట్లు ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, చార్ట్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో టాస్క్ టీం ద్వారా ఐఎస్ఎఫ్ ఫౌండర్ చౌదరి 10 జట్లను ఎంపిక చేయగా, అందులో నుంచి నాలుగు జట్లు తుది జాబితాకు అర్హత సాధించినట్లు వివరించారు. ఇందులో ఒక జట్టు జ్యోతిష్మతి కళాశాల విద్యార్థులు అని, తమ విద్యార్థులకు యూఎస్‌లో నిర్వహించే పరిశోధనలో పాల్గొనేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. భారతదేశ వ్యవసాయ పద్ధతుల గురించి పంట వ్యాధులను గుర్తించడానికి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రాజెక్ట్ ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరిష్కారాన్ని విద్యార్థులు అజిత్, అక్షిత్, రమేశ్ కలిసి రూపొందించారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు. ఇది వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, డీన్ డాక్టర్ పీకే వైశాలి, జగదీషన్ పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం

చిగురుమామిడి, ఏప్రిల్ 9: బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం మండల కేంద్రంలోని కేడీసీసీబీ పక్కన పాత జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఎల్కతుర్తి మండలం చింతలపల్లి ఎక్స్‌రోడ్ వద్ద జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు తరలివెళ్లేందుకు గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. మండలం నుంచి సుమారు 3 వేల కార్యకర్తలతో తరలివెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి మండల నాయకులు, అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

## తేనెటీగల పెంపకం.. ఉపాధికి మార్గం



శాస్త్రవేత్తలు, అధ్యాపకులతో ఎస్సార్‌యూ విద్యార్థులు

జమ్మికుంట, ఏప్రిల్ 9: తేనెటీగల పెంపకంతో ఉపాధి పొందవచ్చని, రైతులు ఆ దిశగా ముందుకు సాగాలని ఎస్సార్‌యూ అధ్యాపకులు డాక్టర్ లాల్‌సింగ్, డాక్టర్ గిరీశ, శ్రీకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్సార్‌యూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తమ ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా బుధవారం మొత్కులగూడెం కమ్యూనిటీ హాల్‌లో రైతులకు 'తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం–అదనపు ఆదాయం'పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు.. తేనెటీగల పెంపకం కోసం పెట్టుబడి, ఆదాయం, తదితర అంశాలను వివరించారు. మహిళలు సైతం పుట్టగొడుగులను ఇళ్లల్లోనూ పెంచవచ్చని తెలిపారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఇక్కడ కేవీకే సిబ్బంది విష్ణువర్ధన్, అశోక్, విద్యార్థులు దాసరి శృతి యాదవ్, నిష, సద్విత, మల్లేశ్వరి, వందన, అభినయ, వర్షిత, కీర్తన, రైతులు, తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE



★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం–1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337576

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం: ఎమ్మెల్యే

గన్నేరువరం, ఏప్రిల్ 9: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే భోజనం

రామడుగు, ఏప్రిల్ 9 : చౌకధరల దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం రామడుగు మండలం దేశరాజ్‌పల్లిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారులు కడపల లచ్చమ్మ రాజయ్య దంపతులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకంతో బడుగు, బలహీన వర్గాల కల సాకారమైందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్‌పర్సన్ బొమ్మరవేణి తిరుమల, వైస్ చైర్మన్ పింగి సత్యం, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జవ్వాజి హరీశ్, నాయకుడు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయపోటీలకు ఎంపికైన పోలీస్ క్రీడాకారులు

కొత్తపల్లి, ఏప్రిల్ 9 : ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగే ఆల్ ఇండియా పోలీస్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ క్లస్టర్ గేమ్స్ జాతీయస్థాయి పోటీలకు రామడుగుకు చెందిన అనుపురం సాయి కృష్ణ, కుర్మపల్లికి చెందిన పులి మాధవి ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్ పేర్కొన్నారు. వీరి ఎంపికపై అసోసియేషన్ నాయకులు, పలు క్రీడా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## తేనెటీగల దాడిలో ట్రాన్స్‌కో సిబ్బందికి గాయాలు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 9: తుమ్మనపల్లి గ్రామంలో బుధవారం విద్యుత్ సిబ్బందిపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. తుమ్మనపల్లి గ్రామంలోని కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలకు అనుకొని ఉన్న చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా, ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ట్రాన్స్‌కో సిబ్బంది శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, తిరుపతి, షబ్బీర్, పురుషోత్తం, శంతన్, స్వామి, గట్టుమల్లు, రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న మరి కొందరిపై కూడా తేనెటీగలు దాడి చేశాయి. హుజూరాబాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఉద్యోగులను డీఈ లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఏడీఈ శ్రీనివాస్, హుజూరాబాద్ టౌన్ ఏఈ శ్రీనివాస్ గౌడ్, రూరల్ ఏఈ జనార్దన్ తదితరులు ఉన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 9: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతామని ఎంపీడీవో సునీత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా, ముందస్తుగా నీటి ఎద్దడి ఉన్న ఎనిమిది గ్రామాలు గుర్తించినట్లు తెలిపారు. గుర్తించిన గ్రామాల్లో నీటి వనరులు సమకూర్చేందుకు ఎలాంటి సదుపాయాలు కావాలో నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు.

## వంట గ్యాస్ ధరల పెంపుపై నిరసన



గ్యాస్ ధరలను తగ్గించాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 9: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ఖాళీ సిలిండర్లు నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, సిలిండర్ ధరపై అదనంగా రూ.50 పెంచడంతో పేద మధ్య తరగతి ప్రజల మీద పెనుభారం పడుతున్నదన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు గుడికందుల సత్యం, బీమా సాహెబ్, వర్ణవెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, సంపత్, రమేశ్, శ్రీకాత్, తిరుపతినాయక్, సురేష్, మల్లయ్య, అరవింద్ పాల్గొన్నారు.

## రసాభాసగా సహకార సంఘం వార్షిక మహాసభ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 9: కరీంనగర్ మండలం దుర్శేడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక మహాసభ బుధవారం రసాభాసగా సాగింది. చైర్మన్ తోట తిరుపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ కార్యదర్శి నేతి వేణుమాధవ్ ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు సంఘ ఆదాయ వ్యయాలు, 2023–24 వరకు ఆడిట్ రిపోర్ట్‌ను చదివి సభ్యులకు వినిపించారు. కాగా, ఈ సందర్భంగా సొసైటీ పరిధిలోని వివిధ అంశాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను సభ్యులు ప్రస్తావించారు. సొసైటీకి వచ్చిన ఎరువులను ఇతర సొసైటీ పరిధిలో ఎలా పంపిణీ చేస్తారంటూ నిలదీశారు. నాకా చౌరస్తా సొసైటీ బ్యాంకు తమకు సహకరించడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పంటరుణం మాఫీ చేసినా పాస్ బుక్ ఇవ్వడం లేదని, అది పోయిందని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారని వాపోయారు. దీంతో ఈ బ్యాంకు మేనేజర్ తమకు వద్దని తీర్మానం చేయాలని, ఒరిజినల్ పాసుబుక్‌లు లేకుండా రుణాలు ఇవ్వాలని తీర్మానం చేయాలని చైర్మన్ తోట తిరుపతి సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ గోనే నర్సయ్య, డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు అడ్డుకట్ట ఎలా?

- విద్యార్థులు గంజాయి బారిన పడకుండా ఏం చేద్దాం
- సంబంధిత శాఖల అధికారులతో పోలీసుల సమాలోచన

శంకరపట్నం, ఏప్రిల్ 9: ఇటీవల మండలంలో వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోతున్నది. విద్యాలయాల్లో పలువురు విద్యార్థులు గంజాయి వ్యసనానికి చిత్తవుతున్నారు. వీటి నిరోధానికి ఏం చేద్దామంటూ పోలీసులు విద్యుత్ శాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ కేశవపట్నం పోలీస్ స్టేషన్, కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశాల నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి తగు సూచనలు, సలహాలను కోరారు. ఈ సందర్భంగా పలువురు పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఎస్ఐ కొత్తపల్లి రవి, ఏఈ సంపత్‌రెడ్డి, లైన్‌మెన్‌లు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పీపీఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా రెహమాన్

కలెక్టరేట్/విద్యానగర్, ఏప్రిల్ 9 : ప్రజాప్రయోజనాల పరిరక్షణ సమితి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నగరానికి చెందిన సామాజిక కార్యకర్త అబ్దుల్ రెహమాన్ నియమితులయ్యారు. ఈమేరకు ఆసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అమేర్ బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో యువజన విభాగం బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు అమేర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 9: పట్టణంలోని శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఫైనలియర్ విద్యార్థులు కాలేజీతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ రెడ్డి, కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టానికి తగినట్లు విద్యార్థులందరూ భవిష్యత్తులో మరింత పట్టుదలతో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కొలిపాక రమేశ్, జల్ల సుధాకర్, వెంకటేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల గడువు పెంపు

కలెక్టరేట్, ఏప్రిల్ 9 : జిల్లాలోని మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పెంచినట్లు, జిల్లా మైనార్టీస్ వెల్ఫేర్ అధికారి బి.పవన్‌కుమార్ తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల కోసం మైనార్టీ విద్యార్థులు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలు కూడా tgmrolstelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం సంబంధిత విద్యాసంస్థల్లో లేదా కలెక్టరేట్‌లోని ఒకటో అంతస్తులో గల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య సంప్రదించవచ్చని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ ప్రచారానికి కాంగ్రెస్‌కు అర్హత లేదు

జమ్మికుంట, ఏప్రిల్9: రాజ్యాంగాన్ని రాయకుండా అడ్డుకున్న కాంగ్రెస్‌కు రాజ్యాంగ పరిరక్షణ పేరిట ప్రచారం చేసే అర్హత లేదని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కో కన్వీనర్ దాసారపు సదానందం విమర్శించారు. జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంపై నిజమైన ప్రేమే ఉంటే ప్రచారం చేస్తున్న ప్రతి గ్రామంలో ఇంటింటికీ అంబేద్కర్ చిత్రపటంతో పాటు రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కపట ప్రేమను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ నాయకులు రవితేజ, సందీప్, కుమార్, రమేశ్, రాకేశ్, ప్రేమ్‌సాగర్, లక్ష్మణ్, రక్షిత్, శంతన్, తదితరులున్నారు.

## బల్దియా కమిషనర్‌ను అభినందించిన ఆర్డీఎంఏ

జమ్మికుంట, ఏప్రిల్9: ఆస్తి పన్ను వసూళ్లలో జమ్మికుంట మున్సిపల్‌ను ప్రథమ స్థానంలో నిలిపిన కమిషనర్ ఎండీ అయాజ్‌ను బుధవారం స్థానిక కార్యాలయంలో ఆర్డీఎంఏ షాహిద్‌మసూద్ అభినందించారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను వసూలుపై దృష్టి సారించాలని ఆర్డీఎంఏ సూచించారు. ముందస్తు పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంతకుముందు బల్దియా ఫిట్టర్ సంపత్‌రావుపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

## పూలే జయంత్యుత్సవాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం

తెలంగాణచౌక్, ఏప్రిల్ 9: ఈ నెల 11న నిర్వహించే జ్యోతిబా పూలే జయంతి వేడుకల ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలు బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు అధికారుల తీరుపై అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు బుధవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాసాచారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, రాష్ట్ర నాయకులు శ్రీధర్‌రాజు, కోటేశ్ ఉన్నారు.

## సొసైటీ సర్వసభ్య సమావేశం వాయిదా

వీణవంక, ఏప్రిల్ 9: వీణవంక సొసైటీ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘం అర్ధవార్షిక సమావేశానికి పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కాలేదు. ఈ క్రమంలో సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని. తిరిగి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని చైర్మన్ ప్రకటించారు. కార్యక్రమంలో సీఈవో చందుపట్ల ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్లు, సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 9: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్, ఏబీ స్విచ్, లైన్ పనులు చేపడుతున్నందున నగరంలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈ లు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8.30నుంచి 10.30గంటల వరకు బోయవాడ, గంజ్, సిక్ వాడి, మార్కెట్ ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్స్, శాస్త్రి రోడ్డు. ఉదయం 9నుంచి 11గంటల వరకు నగునూరు గ్రామం, ప్రతిమ హాస్పిటల్. ఉదయం 9నుంచి 11గంటల వరకు ముకరంపుర, ముకరంపురలోని ఎస్ ఎస్–41ఏరియా. ఉదయం 9.30నుంచి 11.30 గంటల వరకు కిసాన్ నగర్, ప్రవిష్ట ఏరియా, అర్బన్ హెల్త్ సెంటర్, ఖాన్‌పుర రోడ్డు నంబర్ 6 నుంచి 11వరకు, హుస్సేనీ పుర రోడ్డు నంబర్ 9, దుర్గమ్మ గడ్డ, రజ్వీ చమాన్, బొమ్మకల్ బైపాస్, సిటిజన్ కాలనీ, విజయలక్ష్మీ కాలనీ, శ్రీపురం కాలనీ. ఉదయం 10నుంచి 11.30గంటల వరకు మారుతి నగర్, పాత బజార్, వెంకట సాయి రోడ్డు, కాపువాడ, అశోక్ నగర్, గౌరిశంకర్ కాంప్లెక్స్, అశోక్ నగర్, అహ్మద్ పుర. మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు గణేశ్ నగర్ బైపాస్ ఏరియా, తిరుమల థియేటర్, వసంత్ వాలి స్కూల్ ఏరియా, ధ్రువాసి కార్ఖానా, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్ రావు ఇంటి ప్రాంతం, జెప్టో ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## అత్తింటి వారు వేధిస్తున్నారని మహిళ ఆందోళన

శంకరపట్నం, ఏప్రిల్ 9: విడాకులకు సహకరించాలని కొంత కాలంగా తనను అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ బుధవారం వారి ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. వివరాలు.. కరీంపేట్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి భార్య, పిల్లలు మృతిచెందడంతో, చొప్పదండి మండలం మంగళపల్లికి చెందిన గడ్డం స్వప్నను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా, తన భర్త, అత్తా మామలు తమకు సంతానం కలుగడం లేదని, రాజుకు విడాకులు ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తున్నారని ఇటీవల కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా ఒత్తిళ్లు తగ్గకపోవడంతో తాను తన భర్తతోనే కలిసి ఉంటానని తెగేసి చెప్పింది. బంధువులతో పాటు అంబేద్కర్ సంఘం నాయకులు స్వప్నకు మద్దతుగా నిలిచారు. ఆమె తల్లిదండ్రులు, లక్ష్మి, మల్లయ్య తమ కూతురుకు న్యాయం చేయాలని కోరుతున్నారు.